క్లుప్తంగా

రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్ అని, ఆయనను చూసే పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు చేసుకోవడం శుభపరిణామమని తెలిపారు. తద్వారా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో పెట్టుబడులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. పరిశ్రమలు తీసుకొచ్చేందుకు విదేశాలకు వెళ్లి జల్సాలకు రూ.వేల కోట్లు ఖర్చు పెట్టారని, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురాలేక పోయారని ఆరోపించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తిరుపతి రూరల్: ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉదయం 10 గంటలకు తిరుపతి రూరల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన కరుణాకరరెడ్డి పాల్గొంటారని, అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

మూగజీవులను రక్షిద్దాం



ర్యాలీ చేస్తున్న అనిమల్ బర్డ్స్ కేర్ ప్రతినిధులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: మూగజీవులను రక్షిద్దామని అనిమల్, బర్డ్స్ కేర్ సంస్థ నిర్వాహకురాలు ఎస్‌వీ.దివ్యారెడ్డి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం సంస్థ ప్రతినిధులతో కలిసి టౌన్ క్లబ్ సర్కిల్ నుంచి బాలాజీ కాలనీ, వెస్ట్ చర్చ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మానసిక స్థితి సరిగా లేని ఒకటి, రెండు కుక్కలు చేసే తప్పులను చూపి అన్ని కుక్కలనూ చంపడం తగదన్నారు. కార్యక్రమంలో అనిమల్ బర్డ్స్ కేర్ ప్రతినిధులు అబ్దుల్ వదూద్, సాయిధీరజ్, దొరబాబు, తేజశ్విని, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బలిజ భవన్ పనులు

తిరుపతి కల్చరల్: నరసింహతీర్థం రోడ్డులోని బలిజ భవన్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ మాట్లాడుతూ బలిజ భవన్ తిరుపతి బలిజల ఆకాంక్ష అని, పనులు త్వరగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కోరినట్లు తెలిపారు. కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆళ్వార్ మురళి, నందగోపాల్, ద్వారక, సురేష్, సత్య, దొరైరాజ్, సతీష్, ఎర్రంశెట్టి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

52 మందికి జరిమానా

తిరుపతి క్రైమ్: నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 52 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం సిబ్బందితో కలిసి తిరుపతి నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న 31 మంది, మైనర్లు 9 మంది, నంబర్ ప్లేట్‌లేని వాహనాలు నడిపిన 12 మందిని గుర్తించామన్నారు. మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న జెడ్పీటీసీ

పాకాల : మండలంలోని అచ్చమ్మ అగ్రహారం ఎంపీపీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలను సోమవారం జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట శాల, క్రీడా మైదానాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులతో మాట్లాడి చిక్కీలు, కోడిగుడ్లు పెడుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. పాఠశాలలో బోరు మోటారు అవసరం ఉందని హెచ్‌ఎం జార్జి జెడ్పీటీసీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన జెడ్పీటీసీ వెంటనే నిధులు విడుదల చేసి మోటారును ఏర్పాటు చేయాలని మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నంగా బాబురెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో గ్యాస్ సిలిండర్ల చోరీ

చంద్రగిరి: తొండవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం రెండు గ్యాస్ సిలిండర్లు చోరీకి గురయ్యాయి. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు సిలిండర్లు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



తిరుపతి 14వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ముద్రనారాయణ



చంద్రగిరిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో 14వ డివిజన్ అధ్యక్షుడు అనీల్‌రెడ్డి, నాయకులు జాషువా, ప్రమీల, యశోద, ప్రసాద్, గోవర్ధన్, హేమంత్‌రాయల్, మిథున్‌కళ్యాణ్, చందు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

చంద్రగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఆ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం సచివాలయం, గృహసారథుల మండల కన్వీనర్ సీఎం కేశవులు(బుజ్జి) ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా వైఎస్.జగన్ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. అన్ని రంగాల వారికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ఇంటి పెద్ద కొడుకుగా మన్ననలు అందుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, ముదికుప్పం రామ్మూర్తి, బండారు హేమచంద్ర, కొత్త పాటిఆ కోటి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితుల నిరసన



ఆందోళన చేస్తున్న దళితులు



పోలీసుల రక్షణలో ప్రేమజంట

తిరుపతి రూరల్: తహసీల్దార్ లోకేశ్వరి ప్రేమజంటను వేధింపులకు గురిచేశారని ఆరోపిస్తూ ప్రేమికుడి బంధువులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. పుదిపట్లకు చెందిన సంగీతం.రెడ్డెయ్య పెరుమాళ్లపల్లికి చెందిన తేజశ్విని ప్రేమించుకుని ఈ నెల 1న పారిపోయి పెళ్లి చేసుకున్నారు. తిరుపతి పోలీసులను ఆశ్రయించి రక్షణ కల్పించాలని కోరారు. అంతకుముందే తేజశ్విని బంధువులు ఎమ్మార్‌పల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మేజర్లు అయిన రెడ్డెయ్య, తేజశ్వినిని రూరల్ తహసీల్దార్ లోకేశ్వరి ముందు ప్రవేశ పెట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. యువతి బంధువుల నుంచి ఒత్తిడి రావడంతో తహసీల్దార్ మూడు రోజులుగా ప్రేమజంటను కలవలేదు. దీంతో దళితులతో కలిసి ప్రేమజంట సోమవారం తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రేమజంట మేజర్లని నిర్ధారించి పోలీసులకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు రాపూరి ప్రసాద్‌బాబు, కారుమంచి మధు, కుమార్, లోకనాథం పాల్గొన్నారు.

వార్డు మెంబర్ రామచంద్ర మృతి



బేదపూరి. రామచంద్ర (ఫైల్)

భాకరాపేట : జంగావాండ్లపల్లె పంచాయతీ వార్డు మెంబర్, వైఎస్సార్ సీపీ నాయకుడు బేదపూరి రామచంద్ర సోమవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ పీలేరు నియోజకవర్గ పరిశీలకులు, డీసీఎంఎస్ చైర్మన్ సామకోటి సహదేవరెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, సర్పంచ్ సింహాల విమల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఖదీర్‌అహ్మద్, పంచాయతీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

9న సత్యసాయి బాబా విగ్రహ ప్రతిష్ట

తిరుపతి కల్చరల్: కేశవాయనిగుంటలోని సత్యసాయి మందిరంలో 9 సత్యసాయి బాబా విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్టు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సుభాస్ చంద్రబోస్ తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇందులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో శ్రీసత్యసాయి మందిరం సభ్యులు అమర్నాథ్, లోకనాథం, సర్వేశ్వరరావు, ఫాణి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆసరా అక్రమాల నిగ్గు తేల్చాలి

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ఆసరా నిధుల అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం ఆస్పత్రి ప్రాంగణంలో ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ గత సూపరింటెండెంట్ ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొంతమందిని ఆరోగ్యశ్రీలో డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారని తెలిపారు. వారు అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఆసరా నిధుల స్వాహా వెనుక అసలు కారకులను గుర్తించాలన్నారు. విచారణ కమిటీతో సరైన న్యాయం జరగదని, విజిలెన్స్ ఎంక్వైయిరీ వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రవి, రాజా, చంద్రశేఖర్‌రెడ్డి, సర్దార్ శివ, గోవిందస్వామి, శివ, బాల, రమేష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కనుల పండువలా ఊంజల్‌సేవ



ఊంజల్ సేవ చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ఊంజల్‌సేవ కనులపండువలా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేశారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా ఊంజల్ సేవా మండపానికి వేంచేపు చేశారు. వేద మంత్రోచ్చరణల నడుమ ఊంజల్‌సేవ నిర్వహించారు. వెన్నెల కాంతుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పాకాల: పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



చంద్రగిరిలో కానుక అందజేస్తున్న నాయకులు

పాకాల: మండలంలోని దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లెకు చెందిన నూతన వధూవరులు హర్షిత, శివకుమార్‌కు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని ఎంపీటీసీ గౌతమి, నాయకులు గణపతిరెడ్డి, మునికృష్ణ, వినాయక, నాగరాజ, హరిస్థానిక అందజేశారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: దోర్నకంబాల పంచాయతీ మల్లయ్యపల్లి హరిజనవాడకు చెందిన హరీష్, పుష్పలత, అదే విధంగా రెడ్డివారిపల్లి దిగువరెడ్డివారిపల్లికి చెందిన సౌజన్య, శ్రీవంశీకి వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను సోమవారం వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పసల నాగరాజు, సర్పంచులు రేవతి, గౌతమి అందజేశారు.

9న జాబ్ మేళా

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్కే ఎంటర్‌ప్రైజస్ సహకారంతో 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. రేణిగుంట సమీపంలోని డిక్సన్ కంపెనీలో ఎలక్ట్రానిక్ టీవీ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. 19- 30 ఏళ్ల లోపు ఉండి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పాస్, ఫెయిల్ అయిన స్త్రీ పురుష అభ్యర్థులు అర్హులన్నారు. సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, మూడు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9840332850, 9640408264లో సంప్రదించాలన్నారు.

రోడ్లపైనే భవన నిర్మాణ వ్యర్థాల



మాస్టర్ ప్లాన్ రోడ్డుపై వేసిన భవన వ్యర్థాలు

- కళా విహీనంగా అన్నమయ్య మార్గ్
- పట్టించుకోలని అధికారులు



అన్నమయ్య మార్గ్‌కు ఇరువైపులా దర్శనమిస్తున్న వ్యర్థాలు

తిరుపతి తుడా : ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో రోడ్లకు మహర్దశ పట్టింది. ఎన్నడూలేని విధంగా రోడ్ల అభివృద్ధికి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఇటీవల మూడు మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేసి ప్రధాన రహదారులుగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇవి సత్ఫలితాలను ఇవ్వడంతో ఏకకాలంలో 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. సుమారు రూ.4 కోట్లతో 60, 80 అడుగుల వెడల్పుతో నిర్మించిన అన్నమయ్య, వైఎస్సార్ మార్గ్ రోడ్లు రోల్ మోడల్‌గా నిలిచాయి. డివైడర్లు, రోడ్డుకు ఇరువైపులా ఖరీదైన మొక్కలు, విద్యుత్ వెలుగులతో ఈ రోడ్లు సుందరంగా నిలిచాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ స్మార్ట్ రోడ్లు కళావిహీనంగా మారుతున్నాయి. రోడ్లు నిర్మించిన ఏడాదికే దయనీయ స్థితికి చేరాయి. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భవన నిర్మాణ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి రోడ్డుకు ఇరువైపులా వేస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసిన రోడ్లు వ్యర్థాలకు ఆవాసాలుగా మారడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ కోసం రూ.14 కోట్లతో తూకివాకంలో కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిష్ ప్రాజెక్టును నిర్మించారు. తిరుపతి నగరంలో ఉత్పత్తి అయ్యే భవన వ్యర్థాలన్నీ టన్నుల లెక్కన ఆ ప్రాజెక్టుకు తరలించాల్సి వుంది. టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో భవన వ్యర్థాలను తరలించలేకపోతున్నారు. చట్టప్రకారం భవన వ్యర్థాలు నగరంలోని రోడ్లు, ఖాళీ స్థలాల్లో వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి వుంది. వారి పర్యవేక్షణ లోపం కారణంగా ట్రాక్టర్ల యజమానులు వ్యర్థాలతోపాటు చెత్తా చెదారాన్ని నగర రోడ్ల వైపు పారబోస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో వార్డు సచివాలయాల్లో పనిచేసే 101 మంది ప్లానింగ్ సెక్రటరీలు వున్నారు. పటిష్టమైన వ్యవస్థ వున్నా పర్యవేక్షణ లోపం తేటతెల్లమవుతోంది.

అగరాలలో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



లబ్ధిదారులతో కలిసి భూమి పూజచేస్తున్న సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి, స్థానిక నాయకులు

చంద్రగిరి: మండలంలోని అగరాల పంచాయతీలో సోమవారం జగనన్న కాలనీలో సామూహిక ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా టీడీపీ నాయకులు కోర్టు ద్వారా స్టేలు తీసుకొచ్చారు. సమస్యను స్థానిక సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యే చెవిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ క్రమంలో సోమవారం సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు భూమిపూజ చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ 2019లో సుమారు 210 మంది లబ్ధిదారులకు అగరాలలో జగనన్న కాలనీ మంజూరు చేసినట్టు తెలిపారు. కొంతమంది కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో సమస్య పరిష్కారమైందన్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు లబ్ధిదారులు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. సొంత ఇంటి కల నెరవేరడం ఆనందంగా ఉందని వారు సంతోషం వ్యక్తం చేశారు. దక్షిణ మండల అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి, నాయకులు సందిపుట్టి బాలకృష్ణ, సుశీల, ఖాదర్‌బాష, నాగేశ్వరరావు రెడ్డి, పఠాన్ రహీం, సునీల్, రఫి, పురుషోత్తం రెడ్డి, పఠాన్ అక్బర్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేదంలో కొత్త వీవో వీ 27 ప్రో మొబైల్ ఆవిష్కరణ



మొబైల్‌ను విడుదల చేస్తున్న అదనపు ఎస్పీ కులశేఖర్, మొబైల్స్ అధినేత ప్రభాకర్

తిరుపతి కల్చరల్ : సెంట్రల్ పార్క్‌లోని వేదం మొబైల్ షోరూమ్‌లో సోమవారం సరికొత్త వీవో వీ27 ప్రో మొబైల్‌ను విడుదల చేశారు. అదనపు ఎస్పీ కులశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మొబైల్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వీవో వీ 27 ప్రో మొబైల్‌లో సరికొత్త ఫీచర్స్ ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వేదం మొబైల్స్ అధినేత ప్రభాకర్. సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో రూపారాణి

భాకరాపేట: పంచాయతీల్లో ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని తిరుపతి డీఎల్‌పీవో రూపారాణి ఆదేశించారు. ఆమె సోమవారం భాకరాపేట పంచాయతీ కార్యాలయంలో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం పంచాయతీల కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ పన్నుల వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సర్పంచ్ సాకిరి భూపాల్, ఈవోపీఆర్‌డీ మదనమోహనరాజు పాల్గొన్నారు.

మృత్యుంజయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న మృత్యుంజయ స్వామి వారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంతో అభిషేకం చేశారు. అనంతరం సుగంధభరిత పుష్పాలు, గజమాల, వెండి నాగాభరణంతో విశేషాలంకరణ చేశారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళహారతులిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కేవీబీపురం: కాళంగి దళితవాడలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణానాయక్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసి రూ.80 వేల విలువైన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.